# బొమ్మజెముళ్ళు

రేపటిని ఓ అద్భుత స్వప్నాన్ని చేసి.... కోర్కెల కుంచెల్తో ఊహల రంగుల్తో... కన్పించని క్యాన్వాస్మీద చిత్రిస్తూ.... ఒక్కోసారి ఒక్కో భాగాన్ని చెరిపేస్తూ... చెరిపిన్చోటింకో వూహ నద్దుతూ....నేనుంటే జలజమ్మ అరుస్తూ పరుగెత్తుకొచ్చింది.

"నాయినా! వాడు సచ్చిపాయ నాయినా!" అంటూ...

'వాడు' యెవరో స్ఫురించటానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు. అందరిలాగానే వాడెపుడు చచ్చిపోతాడా అని నేనూ ఎదురు చూచిన వాడినే కాబట్టి, ఆ చచ్చింది నా బాల్యమిత్రుడని నేన్చెప్పుకునే మురళి అని తెలీటానికి అరక్షణం కూడా పట్టలేదు నాకు...

నేను ఉలిక్కి పళ్ళేదు...నా వూహలు తొణికీ పళ్లేదు... జాగ్రత్తగా నా వూహల్నీ... రేపటి స్వప్నచిత్రాన్నీ పక్కకి జరిపి బైటికి వచ్చా... వస్తూ.... వస్తూ సామాజికుడి ముఖాన్ని తగిలించుకోడం మాత్రం మరవలేదు..

"మురళి సచ్చిపోయినట్టుం డాడ్నాయినా!... రవ్వంతొచ్చి సూసి పొండ్రి తండ్రీ... మాకీ పీడ యేంటికోగానీ... ఆ ముండకొడుకొచ్చి యీణ్ణే సావాల్నా? కొంత జల్దొచ్చి సూపిపొండ్రి నాయినా!" జలజమ్మనబడే ఆడతనమని లోకమనుకునే, ఇప్పుడు చచ్చిపోయాడన బడ్తూన్న మురళి వదినె ఆక్రోశం....

కలలు కంటూన్న నేను, మరణవార్తని, అదీ నా బాల్యమిత్రుడి మరణవార్తని, మామూలుగా కాఫీ యింకో సిప్ లాగా పీల్చి 'యెంత నిబ్బరం?' అని నాలో నేను ఆశ్చర్యపోతూ కదిలాను...

మురళీ మరణం...

బ్రతుకంతా వంటరియై....ఏకాకిగా... మాట్లాడనూ... పోట్లాడనూ... ఆట్లాడనూ అన్నిటికీ జీవన దౌష్ట్యాన్ని మాత్రమే యెదుర్కొన్న మురళీ మరణం...

బక్క పల్చటి మురళి...

నలభై ఆరేళ్ళ మురళీ....

నెల్రోజుల క్రితం వరకూ, ఓ హోల్సేలర్ దగ్గర సేల్స్‌మన్‌గా పన్చేస్తూ... అంగడంగడీ... చిన్నచిన్న వూళ్ళూ... పల్లెలూ బీడీ బంకులూ... పెద్ద పెద్ద దుకాణాలు తిరుగుతూ... ఆ డొక్కువ్యాన్లో సబ్బులూ, పేస్టులూ, వాసన్నూనెలూ, షాంపూలు అమ్ముతూ, ఓ లాడ్జీ మెట్ల కింది జాగాను గదిగా మార్చి డబ్బుచేసుకునే ఓ వ్యాపారి ముంగిట్లో అంగలార్చిన మురళీ...

తీవ్రంగా జ్వరమొచ్చి... అన్న పంచన చేరిన అనాథ మురళీ...

వివాహమనబడే సామాజికపు ముసుగు తొడుక్కున్న ఒకానొక ప్రాకృతిక సుఖానికి నోచుకోని మురళీ.

రోడ్డు పక్క పాకల్లో, దోసెల్లో ఆశలూ... ఆశల్తో అర్రూపాయల ఖరీదు చేసే పాశాలూ... జాడీ బీడీలూ... బోడి బాడీల చీకటి స్పర్శలూ.... వాటి తాలూకు మామూలు సాదా సీదా అథోజాతి మనిషి మురళీ...

నేను తప్పించుకు తిరిగిన మురళీ...

నా బాల్యస్నేహితుడు మురళీ...

మురళి చచ్చిపోయాడు...

వెళ్లి చూశా...

కాలం కనికరం లేకుండా కర్కశంగా మురళి శరీరమ్మీద అడుగులేస్తూ నడచి పోయిన గుర్తులు దిగంబరంగా...

చనిపోయి చాలాసేపైనట్టుంది. శరీరం బాగా చల్లగా వుంది... నీళ్ళు రాని కళ్ళతో మురళి తమ్ముడు 'లక్షింపతి' అనబడే లక్ష్మీపతి అనబడే ఓ దరిద్రుడు పీనుగ కింద పరచి ఉన్న దుప్పటిలాగి మడిచి పక్కన పెట్టుకున్నాడు.

"అనా! పైట్యాలకి మంచుల్దొరకరు... జల్దీ దిబ్బకేచ్చాం... మా మంచుల్గాడ అందరూ వాచ్చేసిరి.... యేంనా?" మురళి అన్న... యెంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా యీ పీడని వదలించుకోవాలనే ఆత్రం....

"ముందు పీనిగెని మంచమ్మీంచి కిందెయ్యండ్రి" - ఓ పెద్దాయన సలహా.

"పట్టండి" అని నేను ముందుకు కదిలా...

దుప్పటి తొలగ్గానే... వెల్లకిలా పడ్డ మురళి కుడిచేయి.... 'నా చేతికింత ఆసరా యివ్వండని' మురళీ శవం జాలిగా... దీనంగా... దయనీయంగా... యీ దుర్మార్గపు ప్రపంచాన్ని దేబరిస్తున్నట్టు చాచిన మురళి చేయి...

లోపలి మనసు మాటిమాటికీ లేస్తోంది... నా సామాజికుడు దాన్ని తొక్కిపడుతూనే వున్నాడు...

మనసు కీచుమని అరుస్తోంది...

'మురళీ! అపుడు... ఎప్పుడో ఆ చిన్నప్పుడు... ఆ మసక మసక జ్ఞాపకాల్లో అక్కడెక్కడో.... ఊరిబైట గచ్చు పొదల్లో... బైరాగి దిమ్మ మీద... ఆరిఫ్ టాకీసు టిక్కెట్టు

క్యూలో... చిల్లాకట్టే... పాడుపనిల్లూ... ఇంకా పైట కూడా వేయని కూర్మమ్మా... ఒరేయ్ మిత్రుడా... నా బాల్యపు, కౌమారపు పేజీల నిండా, యెవ్వరూ దిద్దలేని అచ్చుతప్పైన అక్షరాల్నిండిన వాక్యమా....! నిశ్చలనమై నిలిచి పోయిన నీ చేతిలో గత లతాంత సువాసనల్ని యే విధంగా అద్దనురా?!' అని మనసాక్రోశిస్తూంటే...

'చాలు చాల్లే, అవన్నీ బాల్య చేష్టలు, లోకం తెలీని తనపు జాడలవి.. ఎవరి కర్మకెవరు బాధ్యులు... వీణ్ణిట్లా పతనమై పొమ్మని నువ్వు చెప్పావా... లేదూ నువ్వే వాడి పతనానికి కారణమైనావా?' అని నా లోపలి సామాజికుడు ప్రస్తుత మురళీ స్థితికి నువ్వేం కారణం కాదులే... నీ తప్పేం లేదులే... అని నన్నునుయిస్తున్నాడు...

'ఓహోహో సామాజికుడా!'

"బొత్నేల్లు రెండూ పురికొసతోని కల్పి కట్టుండ్రి" ఎవరో అంటున్నారు.

మంచం మీంచి దింపడానికి... నాని, చివికి... ఛిద్రమై కంపుకొడ్తూన్న దిండు మీంచి మురళి తల పైకెత్తితే...

నోట్లోంచి వాసన... రెండు మూడు రోజుల్గా పోసుకున్న ఉచ్చా రొచ్చూ... గుప్పున నా మీదకి దాడిచేసాయి....

"దిండుతీ.... దిండుతీ..." అడంగుల అత్రం... ఆ చివికి పోయిన దిండు కిందేవో లంకె బిందెలూ.... నిధి నిక్షేపాలూ వుంటాయేమోనన్న క్రూరత్వం...

దిండు కింద ఓ పాలిథీన్ కవర్లో ఓ ఉత్తరాల కట్టా... రంగుల్మాసిపోయిన ఓ సిల్కు కర్చీఫ్‌తో కట్టిన చిన్న మూటా కన్పించాయి. ఆ కర్చీఫ్ మూట విప్పి చాల్రోజులై వుంటుందని, దానికున్న ముళ్ళని చూస్తేనే అర్థమౌతోంది.. మురళి తమ్ముడు లక్షింపతీ, నేనూ శవం దగ్గరగా వున్నాం కాబట్టి మేమిద్దరమే వాటిని ముందుగా చూశాం. లక్షింపతి టకటకా ఆ కర్చీఫ్ ముళ్ళు విప్పేశాడు. లోపల సుమారు ఆరేడు వందల రూపాయలూ, ఓ చిన్న కాగితపు ముక్కా వున్నాయి... పి.సీ. సర్కారు కంటే వేగంగా లాఘవంగా లక్షింపతి ఆ డబ్బుని జేబిలోకీ, కాగితపు ముక్కని పాలిథీన్ కవర్లోకీ మార్చేసాడు.. శవాలను దోచుకోడం గురించి ఇప్పటి వరకూ వినడం మాత్రమే... సంబంధ బాంధవ్యాలు తెగి రాలిపడిపోయిం తర్వాత... ఎవరికెవరు? అన్న... తమ్ముడు... తల్లీ... తండ్రీ... స్నేహితులూ... ఎవరు? ఇది ఓ శవం అంతే... అది కూడా ఓ అనాథ శవం. ఆ శవం బ్రతికున్నపుడు దానిపేరు

ము............ర.............ళి.

ఆ ఉత్తరాల కట్టా, ఖాళీ కర్చీఫ్ లక్షింపతి వాళ్ళన్నకి చూపించాడు.

"థోత్తెరి... యీ నా బట్టక్కాకితాలోటి... యేంటికిరా అవీ? పార్నూకున్రి...దలిద్రెం దలిద్రెమన్జెప్పి" - అసహ్యంచుకున్నాడు మురళి అన్న. ఆ చీదరింపు, మురళి చచ్చేదేదో యే రోడ్డు మీదో యింకో తమ్ముడింట్లోనో, లేదూ వాడి గదిలోనే చచ్చుంటే బావుణ్ణు అన్నట్టుండింది.... అదీ దిగంబరంగా...

నాలో కుతూహలం...

4883

"ఆగండి మీకవసరం లేకపోతే నేను తీసుకుంటానా కాగితాల్ని... ఆస్తికి సంబంధించి గొడవలేమీ లేవు కదా?" అని నేను జాగ్రత్త పడుతూ అడిగా...

"తీస్కోనా... వాని జాబుల్తోనీ... కాకితాల్తోనీ మాకేం పెరికేపని..? మిగిలిన ఇరవైయెన్మిదెకరాలూ... గొడ్లు బాగానై పెదిన్ని దినాలై పాయ... ఇంగేం మిగుల్తాది... ఇనాబట్టని గుంత జేసే కర్సు తప్ప."

'అమానుషం... అమానుషం' నాలో మనిషి...! బ్రతుకు నాటకంతెర తీసినప్పటినుంచీ అన్నప్మెతుక్కోసం అంగల్చార్చిన మురళి శరీరం, ఆఖరికి శవమై కూడా అవమానింపబడ్తోంది... వాడు ఆకలి చావే చచ్చాడని అనుమానం...

అందరం గొప్ప గొప్ప మాటలు మాట్లాడే వాళ్ళమే... యేవేవో అర్థం కాని అర్థం లేని సిద్ధాంతాలు వల్లె వేసే వాళ్ళమే... మాటల్నిండా మానవత్వం... కళ్ళ నిండా కారుణ్యం కార్చేవాళ్ళమే...

కానీ మా మొండేలకు వేలాడ్తోన్న చేతులు మాత్రం మొండివి. మా గుండెలు ఎండినవి.... మేమూ మనుషులమే... పిలిచి పిడికెడన్నం వాడికి వెయ్యగలిగుండీ వేస్తే... అదికాస్తా రోజువారీ తద్దినమై, పీడై మా నెత్తికి చుట్టుకుంటుందేమోనన్న అసహ్యపు చింతనతో మాకు మేముగా మిగిలిన మనుషులం...

సా.........మా.........జి.........కులం

వాడు అరుగు మీద కూచుని.... ఆశగా గుంటలు పడ్డ కళ్ళతో... పీక్కుపోయిన మొహంతో... యేదోవిధంగా నన్నా కర్షించాలని, నేను అటూ ఇటూ రోడ్డుపై తిరుగుతున్నప్పుడు వాడు ప్రయత్నిస్తూంటే వాడి చూపులకి నా రూపం చిక్కు కోకూడదని, చిత్ర విచిత్ర ప్రయత్నాలు చేసి తప్పించుకు తిరిగినవాణ్ణి నేనే... వాడి బాల్యమిత్రుడిని.

ఇప్పుడు మాత్రం? యేమాత్రం చొరవ చూపినా

వల్లకాట్లో గుంత తవ్వించిన కూలీనో...

పాడె కోసం బొంగుల కయ్యే ఖర్చో...

శవం మీద సైనుగుడ్డ బిల్లో....

యేది... యేది నా మీద పడ్తుందో అని జాగ్రత్త పడే సామాజికుడే నా ముఖ చిత్రం....

యే అర్భాటం లేకుండా.... కనీసం ఓ తడి కన్ను తోడు కూడా లేకుండా.... మురళి పీనుగ కదిలింది.

ఈ సభ్య సమాజంలో సామాన్యుల్లో మరీ సామాన్యుడిగా పుట్టి, ముందు తండ్రీ, తర్వాత తల్లీ, ఆ తర్వాత ఆప్యాయతా... ఇంకా ఇంకా అన్ని సంబంధాలూ ఒక్కొటొక్కటిగా పోగొట్టుకుని ఆఖరికి అనాథయై, ఎవ్వరూ భరించలేని అసహ్యంగా పరిణమించిన మురళిశవం, ఆఖరికి మనస్ఫూర్తిగా తనను ఆహ్వానించనుకూడా ఆహ్వానించలేని స్మశానంవైపు కదిలింది.

కదిలి మన్నెంది....

మన్నూ మిన్నూ ఏకం కాలేదు...

మౌనంగా మామూలుగానే వున్నాయి...

❀❀❀

మురళి తల క్రిందనుంచీ నేను తీసుకొచ్చిన పాలిథీన్ కవర్లోని ఉత్తరాలూ, కాగితాలు రెండ్రోజుల వరకూ చూట్టం పళ్ళేదు....ఈ రెండ్రోజులూ మురళి కళ్ళు నన్ను వెంటాడ్తూనే వున్నాయి... గుబులు గుబులుగా వుండింది... రెండ్రోజులుగా అదే దృశ్యం... జాలిగా గుంటలు పడ్డ కళ్ళతో కట్ట మీద కూచున్న మురళి... నన్ను తన చూపుల్తో పిలుస్తున్నట్టు...అదే అదే దృశ్యం... నాకే తెల్సిపోయింది... ఆ కళ్ళను తప్పించుకోలేను. తప్పించుకోడంకన్నా ఎదుర్కోడమే సులభం... ఎలా ఎదుర్కోను? మురళి చచ్చిపోయాడే... ఉత్తరాలు తెరవాలంటే భయం...

ఒక్క క్షణం మనస్సుగ్గబట్టుకుని ఆత్మను గిరుక్కున వెనక్కి తిప్పేసాను...

నా ఎదురుగా మడతలు మడతలుగా పర్చుకున్న మురళి తాలూకు అస్పష్టత ఉత్తరాల రూపంలో....ఇప్పుడనిపిస్తోంది... నన్ను తరుముతూన్న కళ్ళల్లో... ఆకలి లేదు... యేదో ఆర్తి...

యేదో అడగాలని కాదు. ఆ కళ్ళు నన్ను వెంటాడింది... యేదో చెప్పాలని... ఇన్నాళ్ళూ ఆ కళ్ళను తద్వారా మురళిని తప్పించుకుని నేను పొరపాటు చేసానా అన్పించింది..

ఎవరో చెన్నకేశవులు రాసిన ఉత్తరా.లవి... రాయించిన ఉత్తరాలనడం సబబేమో!

ఫ్రం అడ్రసు -

'చెన్నకేశవులు, కాఫీ హోటలు

బస్టాండు, ముగ్గురాళ్ళ (పోస్టు)'

ప్రతి ఉత్తరం వెనకా అదే అడ్రసు... దాదాపు అన్నీ ఇన్లాండు లెటర్లే.... దాదాపు అన్నీ ఒకే ఉత్తరానికి నకళ్ళ లాగా వున్నాయి...

"మురళీ సారుకు,

కాపీ ఓటలు చెన్నకేశవులు రాయించిన ఉత్తరం యేమనగా, నువు పంపించిన దుడ్డు ముట్టినది, శీనివాసులికి యిరవై, సాయమ్మకు ముప్పయి ఇప్పించడం అయినది, ఈ పక్కవచ్చినప్పుడు వచ్చి పోయేడిదని మనవి.

రాయించినవారు కాపీ ఓటలు చెన్నకేశవులు."

డబ్బు లెక్కలో కొద్ది తేడా అంతే... దాదాపు అన్ని ఉత్తరాలూ అంతే... మొత్తం కలిపి పదిహేడుత్తరాలు.... పధ్నాలుగో ఉత్తరం తీస్తోంటే మడతల్లోంచీ జారి ఓ చిన్న ఫొటో ముక్క కింద పడింది... నలుగురైదుగురు కల్సి తీయించుకున్న గ్రూపు ఫొటో లోంచి నిలువుగా కత్తరించి తీసిన ఓ పిల్లవాడి ఫొటో.

చూసీ చూడగానే అనిపించింది, వాడు మురళిలా వున్నాడని... చిన్నప్పటి మురళి

ముఖం గుర్తు రాకున్నా, గుర్తు తెచ్చు కోడానికి ప్రయత్నించి... వచ్చిందనుకుని, ఆ ఫొటోలో పిల్లవాడి మొహంతో గుర్తుకురాని మురళి బాల్యముఖాన్ని కలిపి... అవునవును మురళి ఇలాగే వుండేవాడని తృప్తిగా అనుకుని... నిర్ణయించుకున్నా... ఈ ఫొటో ముక్క మురళి కొడుకుదీ' అని

ఏదో వికృతమైన తృప్తి..

యథాలాపంగా ఆ ఫొటో ముక్కని తిప్పి చూసా... పెన్సిల్తో యేవో అంకెలు వేసున్నాయి... ట్యూబ్లైట్ వెల్తురుకి పెట్టి చూసా... 'అయిదు వందలా అరవై' అని అంకెల్లో వేసుంది...

ఠక్కున చచ్చిపోయిన మురళి దిండు కింద కర్చీఫ్తో కట్టిన మూటా, ఆ మూటలో డబ్బూ, అవి తీసి దాచేసిన మురళి తమ్ముడు లక్షింపతీ వెంట వెంటనే స్ఫురణకు రావడం జరిగింది.

అయిదు వందలా అరవై అని ఫొటో వెనక వేసిన అంకెకూ, చచ్చిపోయిన మురళి దిండు కింది ఆ డబ్బుకూ లంకె యెట్లా పెట్టగలిగిందో యీ మానవ మేథ?!!!

అటుతర్వాత వెంటనే లక్షింపతి డబ్బు జేబులో దోపుకుని ఓ చిన్న కాయితపుముక్కను కవర్లో కుక్కడం గుర్తొచ్చింది. వెంటనే ఉత్తరాలన్నిట్నీ విదిలించా...

ఆ పేపరు ముక్క...

దాని మీద...

'శ్రీనివాసులు, C/o. చెన్నకేశవులు,

కాఫీ హోటలు, బస్టాండు,

ముగ్గురాళ్ళ (పోస్టు).'

ఆ అడ్రసు తర్వాత మూలగా అయిదు వందలా అరవై అంకె వేసుంది.

అయిపోయింది... లింకు దొరికింది... ఆ కుర్రాడి ఫొటో వెనక 560/- చీటీలో శ్రీనివాసులు, ఉత్తరాలలో చెన్నకేశవులు రాసిన సాయమ్మ...

దొరికింది... దొరికింది... ఈ వికృతమైన మానవ మేధకు లింకు దొరికింది....

ముగ్గురాళ్ళలో సాయమ్మ అనే స్త్రీతో మురళి సంబంధం పెట్టుకున్నాడు. ఆమె ద్వారా ఓ కొడుకును కన్నాడు. వాడి పేరే శ్రీనివాసులు... ఈ ఫొటో ముక్కలో ఉన్న కుర్రాడే శ్రీనివాసులు. వాళ్ళకి అప్పుడప్పుడూ చెన్నకేశవులనబడే కాఫీ హోటల్ ఓనరు ద్వారా డబ్బు పంపిచేవాడు మురళి... ఆఖరి రోజుల్లో యేదో పెద్ద అవసరమొచ్చి, తన కొడుకైన శ్రీనివాసుల్కి అయిదు వందలా అరవై రూపాయలు పంపించాలని మూటకట్టి పెట్టుకున్న మురళి చచ్చిపోయాడు. ఆ మూటలో అయిదు వందలా అరవై రూపాయలున్నాయి...

అంతే! ఒక అద్భుతమైన కథ అల్లేసింది మనిషి మేధ.

ఊహకు వాస్తవాల్తో నిమిత్తం లేదు... అస్సలు సంబంధం లేని విషయాలను

కూడా యేవోయేవో 'ఆధారాలు' కల్పించుకుని కలిపేసుకుంటుంది... పట్టు దొరకాలంతే... దొరికింది, మొదటి పట్టు మురళి అవివాహితుడు కావడం.... రెండో పట్టు చెన్న కేశవులు రాసిన ఉత్తరాలు... మూడు అందులో చెన్నకేశవులు పేర్కొన్న సాయమ్మ, శ్రీనివాసులు... ఆ తర్వాత చచ్చిపోయిన మురళి తల క్రింద డబ్బు మూట కర్చీఫ్... వీటిని, వీటన్నిటీ కలుపుతూ మురళి చూపులు... ఇప్పుడందుకే మురళి చూపుల్లో ఆకలి లేదు... యేదో చెప్పాలన్న ఆరాటం కనబడ్తోంది నా వికృతమైన మేధకు... ఆ చెప్పాలనుకున్నది కూడా నేను నేసిన, పేనిన...అల్లిన అద్భుతమైన కథే...

సెహభాష్ మనిషీ! నీ మేథకు సాటి యేదీ లేదీ ప్రపంచంలో... నిన్నటి వరకూ మురళి జస్ట్ ఓ దరిద్రుడు, అనాథ, ఆకలితో కేకలు వేయలేక చూపుల్తో వేటాడిన వాడు. కానీ ఇప్పుడో... ఈ ఉత్తరాల ద్వారా మురళి వేరే.... వాడికి ఎవరికీ తెలీని జీవితముంది... యేమిటది? అన్న ప్రశ్నకు... నా మేధ అల్లేసిన కథే జవాబు... అదీ సరైన సమాధానమేనా?!

కుతూహలం... వికృత కుతూహలం... ఇంతవరకూ మురళి మీదున్న జాలి స్థానంలో ఓ పేద్ద ప్రశ్న నిల్చుంది... మానవత్వం, అమానుషత్వం అన్న విచికిత్స నాశనమైపోయి... ప్రశ్నలు, ప్రశ్నలూ... ప్రశ్నలు.

మురళి అవ్యక్త వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడాలి... ఎవరికీ తెలీని మురళి స్వంత జీవితంలో యేముంది? నిజానికి నా కస్సలు అవసరంలేని విషయాలవి... అయినా సరే తెల్సుకోవాలనే యావ... కుతూహలం...

కుతూహలం నాగరికతల్నీ... శాస్త్ర సాంకేతికాభివృద్ధినీ సాధించింది.... కానీ నాలో ఇప్పుడున్నది దాని వికృత ముఖం...

ముగ్గురాళ్ళ దూరమేం కాదు... యస్... వెళ్ళాలి... వెళ్ళి మురళిని తెల్సుకోవాలి. చచ్చిపోయిన వాడిని తవ్వి, కెలికి తిరగతోడాలని ఓ పైశాచిక నిర్ణయం, తనకంటే కొన్ని కోట్ల రెట్లు పెద్దదైన కుతూహలాన్ని తొడుక్కున్న నా మరుగుజ్జు మెదడు తీసుకుంది.

❀ ❀ ❀

ముగ్గురాళ్ళ పెద్ద వూరేమీ కాదు... హైవే మీదున్నందున డాబాలనబడే పాక హోటళ్ళూ, సిగరెట్ బంకులూ, పంచర్లు వేసే వాళ్ళూ... ఓ డీజిల్ పంపూ... మెకానిక్ షెడ్డూ... హైవేకు అతి సాధారణమైన అలంకరణ హోరెత్తించే పాటల గోల... ముగ్గురాళ్లపల్లె రోడ్డు మీంచి ఓ కిలోమీటరు లోపలికుంది...

దిగీ దిగగానే... గుండ్రంగా రంధ్రాలున్న రేకు చట్రంలోకి టీ గ్లాసులు దిగేసుకు వెళ్తున్న ఓ పన్నెండేళ్ళ కుర్రాణ్ణి నిలిపి చెన్నకేశవుల హోటలేదని అడిగా... వాడు వేలు పెట్టి చూపించాడు.

మనసులో వికృతత్వం....

ఆ కుర్రాణ్ణి పట్టి పట్టి చూశా... ఫొటోలో వాడూ, వీడేనేమోనని.... వూహూఁ కాదు... కాదని నిర్ణయించుకుని కదిలా... ఇంతకీ ఫొటోలో వున్న కుర్రవాడి పేరు శ్రీనివాసులూ అనడానికి నా దగ్గర రుజువు లేదు... అసలు శ్రీనివాసులు మురళి కొడుకూ అనడానికి అస్సలు ఆధారం లేదు...

నేనేదో గొప్ప రహస్యాన్ని ఛేదించబోతూన్న హుషారు..

చెన్నకేశవుల హోటలు పెద్ద వార పాక, దానికి ఒకప్పుడు బోర్డు లాంటిది వుండిందేమో... ఏదో తుప్పుపట్టిన బోర్డు లాంటిది మండుతూన్న పంప్ స్టౌకి అడ్డంగా పెట్టుంది. బాగా బైటికి, దాదాపు రోడ్డు దగ్గరికి ఓ గుండ్రటి సిమెంటు నీళ్ళ తొట్టే... దానిమీద సగం మూసిన ఓ కుళ్ళిపోయిన చెక్కముక్కా...దానిమీదో జిడ్డు పట్టిన ఓ మురికి ప్లాస్టిక్ గ్లాసూ వున్నాయి... పాక ముందు మూడు మడత రేకు కుర్చీలు... రెండింటికీ వెనకల బ్యాక్ రెస్టులు లేవు. మూడోదాని ఓ కాలు గాల్లో తేలుతోంది.... ఓ పొడవాటి చెక్కబల్ల.

బ్యాక్ రెస్ట్ లేని రెండు రేకు కుర్చీల నాక్రమించుకుని ఇద్దరు వ్యక్తులు 'ఉగ్గాని' అనబడే బొరుగుల తిరగమోత, మిరపకాయ బజ్జీల్తోటి కలిపి తింటున్నారు. పక్కగా మండుతూన్న బాయిలర్లో నీళ్ళు కుతకుతా ఉడుకుతున్నాయ్. ఆ బాయిలర్ వెనక నిలబడి ఓ నల్లటి వ్యక్తి ముక్కులో వేలు పెట్టుకుని కెలుక్కుంటున్నాడు... బహుశ వాడే చెన్నకేశవులై వుంటాడు...

నన్ను చూసి ముక్కులోంచి వేలు తీయకుండానే 'యేం'? అన్నట్టు తలెగరేశాడు వాడు.

"కేశవు... చెన్నకేశవులూ?" అనుమానంగా అడిగా...

"యా కేశులన్నా... శెన్నకేశుల్గాడా!... అనా కొడుక్కాడే గదా యీ ఓటల్గొనుకుంది నేనూ... ఆ నా కొడుకు దెంకవోయి కూడా మూనెల్లు కానీ కొచ్చాంది... నువ్వెవులన్నా?"

ఒక్కసారి రేగుతూన్న మంట మీద నీళ్ళు చల్లినట్టయింది....

"ఔ.... పల్కకబోతివి... వాన్తోని నీకేం పనీ? బాక్యా?"

లేదన్నట్టు తలడ్డంగా వూపా... ఇంకా ఆశ చావలే...

"శీను... శ్రీనివాసులని చెన్న కేశవుల్దగ్గర పన్చేసే అబ్బాయుండేవాడు, నీకు, నీకేమైనా తెలుసా?" ఆశగా అడిగా...

"ఆ డాఫర్నాబట్టా...! సాయమ్మ కొడుగ్గదా నా కొడుకు, తల్లికి డాఫర్వన్చేసేటోడు.. లేళ్ళే....

ఆ నాకొడుక్కూడా లారీ సైమన్తోని అయిదరవాదుకు పార్నాడు... వాడు బొయ్ నెంకనే... శెన్నకేశుల్గాడు సాయమ్మన్లెప్క పాయ... ఔ సెప్పకబోతివి నీకేంటికినా యియన్నీ...?"

గొంతు పెద్దగా చేసి అరుస్తున్నట్టు మాట్లాడ్తున్నాడు వాడు.. కుర్చీల్లో 'ఉగ్గాని బజ్జీ' కస్టమర్లు నన్ను కుతూహలంతో చూస్తున్నారు. అసహనంగా వున్నా చంపుకోలేని

వికృత కుతూహలం నా లోపల... అదే నన్నీ క్షణాన యిక్కడుంచింది. సాయమ్మ పేరు వినగానే మళ్ళీ ఆశ కొమ్మలు రెమ్మలు తొడిగింది.

"నీ పేరేమిటి?" వాడినడిగా బెంచీ మీద కూచుని ఓ సిగరెట్ వెలిగించి...

"సుంకన్న... ఔ సారూ! శెన్నకేశులగ్నాన్తోని నీకేం పనో సెప్పలా?" అడిగాడు వాడు...

నా ఊరూ పేరూ చెప్పి... వాడిచ్చిన మురికి టీ గ్లాసు తీసుకుని, "మురళి తెలుసా నీకు?" రాయివేసా...

"మురల్యా? యెవులో తెల్దుసా... అయ్నెకీ, శెన్నకేశులుగానికీ యేమన్నా లిగాడీనా?" అమాయకమైన నిజాయితీతో అడిగాడు వాడు.

"అంటే మురళి... మురళి యెవరో నీ కస్సలు తెలీదా?" - ఉత్సాహం, కుతూహలం రెండూ నిట్ట నిలువునా కూలిపోతూంటే...

"తెల్దని సెప్పల్యానా సారూ... శెన్న కేశులగ్గాడు జెప్ప తెల్చు... ఆ నాకొడుక్కానే యీ ఓటలు నాల్గు యెయ్యిల్కి నేను గొనుక్కున్న... నాకిమ్మనెంక ఆ రాత్రికాన్నే సాయమ్మనేల్లప్కపాయ...."

"సాయమ్మెవరు?" ఇంకా ఆశా కుతూహలం..

"జోరా బాయమ్మ కంపెన్ల లంజ" మామూలుగా చెప్పాడు..

"ఇక్కడ ముగ్గురాళ్ళలో చెన్నకేశవుల్ని తెలిసిన వాళ్ళెవరూ లేరా?" ఇంకా ఇంకా లోతుకు తవ్వాలనే కోరిక...

"నా అనే తోల్లు లేర్సారూ... అనాకొడుక్కి... యాన్నించొచ్చినాడోగూడ తెల్దు... జోరాబాయమ్మకి దెల్చింటే తెల్చిండొచ్చుగానీ అది సచ్చిగూడా యాడాదైపాయగదా..."

అయిపోయింది యిక ముందుకు దారి లేదు... మళ్ళీ మామూలే...మురళి అనాథ... వాడి మీద జాలి... నేను వాడికేమీ చేయలేదన్న అపరాధ భావన.... వీటన్నిటినీ మించి ఏదో

ని.........రా..........శ

నా నమ్మకాల్ని, అనుమానాల్నీఅన్నిటినీ పటాపంచలు చేస్తూ నేనతి జాగ్రత్తగా అల్లిన 'కథ'ను కకావికలు చేస్తూ... నిరాశ... మురళిని తవ్వుదామనుకుంటే పలుగేసిన అడుక్కే ఓ పెద్దబండ... ఉత్తరాలు చూడకముందు ఒక్క మురళి మాత్రమే... ఇప్పుడో... చెన్నకేశవులు, శ్రీనివాసు, సాయమ్మ. అయిదు వందలా అరవై రూపాయలు, పిల్లవాడి ఫొటో.... ఇవన్నీ కల్సి నన్ను వెంటాడుతూ, వెంటాడుతూ... నేను వెనుతిరిగి చూస్తే తక్కున కాలం పొదల్లో దాక్కుంటూ.... చీకటి అడవిలో మెరిసే కళ్ళలాగా...

కుతూహలం పొలంలో అనుమానపు బీజాన్ని నాటితే మొండి చేతుల బొమ్మజెముడు తలలు లేచినట్టు వికృతమైన వూహలు లేస్తునే వుంటాయి.

★

*(రచన ఇంటింటి పత్రిక : డిసెంబర్ 2000)*